క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



పొన్నూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్లలూరు గ్రామానికి చెందిన అంబటి ధనలక్ష్మికి మోకాళ్ళ ఆపరేషన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఇరవై వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే రోశయ్య ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లికార్జున రావు, వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య యానిమల్ హస్బండ్రీ డైరెక్టర్ రమణ, వీరేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గుంటూరు రూరల్: శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడవాడలా ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని వెంగళాయపాలెం, జొన్నలగడ్డ, గోరంట్ల, గోర్లవారిపాలెం, తోకావారిపాలెం, తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

భర్త, అత్త వేధింపులపై కేసు నమోదు

చేబ్రోలు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తలపై చేబ్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చేబ్రోలు యడ్లపాటి నగర్ ప్రాంతానికి చెందిన గేరా ప్రవల్లికను దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన గేరా అశోక్‌కు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన అశోక్‌ను భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అత్త, భర్తలు అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై ప్రవల్లిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా జూదరుల అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని చీరాల బస్ స్టాప్, ఇతర ప్రాంతాలలో మట్కా జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై బి. రామబ్రహ్మం బుధవారం తెలిపారు. వారి వద్ద రూ. 3,500 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

వేతనాలు అందక ఉపాధ్యాయులు సతమతం: యూటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఖజానాధికారి పి. రాజగోపాలరావుకు విజ్ఞప్తి చేసినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం తగదని, వెంటనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అడ్వాన్స్ తీసుకుని మొహం చాటేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి చికెన్ షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ సాబిల్ వికలాంగుల కాలనీలోని శివమ్మ చికెన్ షాపులో పని చేసేందుకు ఒప్పుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 1,50,000 తీసుకుని మొహం చాటేశాడు. సెల్ కూడా స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయినట్లు నిర్ధారించుకున్న శివమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు నలుగురు యువకులు గూడ్సు ఆటోలో వాటర్ క్యాన్లు తరలిస్తున్నారు. ఈ సమయంలో ఆటోడ్రైవర్ రామకృష్ణతో పాటు డి.వెంకటేశ్వర్లు, అల్లూరి ఏసుబాబుతో పాటు మరో యువకుడు ప్రయాణిస్తున్నారు. కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న మలుపులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు (20) అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ రామకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి. మృతి చెందిన ఏసుబాబుకు తండ్రి చనిపోవడంతో కుటుంబ భారాన్ని ఇతనే తీసుకుని తన తల్లిని పోషించుకుంటున్నాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది. పోలీసులు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఏసుబాబు మృతదేహాన్ని తరలించారు.

పొన్నూరులో ఓటర్ల సర్వే వంద శాతం పూర్తి

- నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగిన బీఎల్‌వోలు
- అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయమై పనిచేసిన అధికారులు
- సందేహాలపై ఎప్పటికప్పుడు రీ సర్వేలు



ఉప్పలపాడు గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)



ఇంటింటి ఓటరు సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

పొన్నూరు: నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కార్యక్రమం వంద శాతం పూర్తయింది. పొన్నూరు, పట్టణ, మండలం, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పుల కోసం చేపట్టిన సర్వేని అధికారులు పూర్తి చేశారు. మొత్తం 264 పోలింగ్ కేంద్రాల్లో 264 మంది బీఎల్‌వోలు విధులు నిర్వహించారు. 2,22,179 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,06,921 మంది, స్త్రీలు 1,15,239 మంది, ట్రాన్స్ జెండర్లు 19 మంది ఉన్నారు.

రాజకీయ పార్టీల సమన్వయంతో..

ఓటరు నమోదు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంతో పాటు రాజకీయ పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతో సర్వే త్వరితగతిన పూర్తయింది. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఓటర్ల సర్వేను ఓటరు నమోదు అధికారులు, సహాయ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. జులై 27వ తేదీన ప్రారంభమైన ఇంటింటి ఓటరు సర్వేను ఆగస్టు 31వ తేదీన పూర్తి చేశారు. రాజకీయ పార్టీల సందేహాలను పరిష్కరించేందుకు మరో ఐదు రోజులు సమయం ఇచ్చి సందేహాలను కూడా పరిష్కరించారు.

ఫిర్యాదులపై రీ సర్వే..

ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశంలో వారి నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు రీ సర్వే చేపడుతున్నాం. రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న పొన్నూరు నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేరే పోలింగ్ కేంద్రంలో ఓటరుగా నమోదై ఉన్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ప్రాంతంలో పోలింగ్ ఏర్పాటు చేయాలని పలు రకాల సందేహాలను రాజకీయ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా కూడా బీఎల్‌వోలు సర్వే చేపట్టి సందేహాలను పరిష్కరిస్తున్నారు. సందేహాలు వ్యక్తమైన ప్రాంతాల్లో అధికారులు పరిశీలించారు. సక్రమంగా విధులు నిర్వహించని పెదకాకాని మండలం బీఎల్‌వోపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గంలో కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు -3109		
మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నవారు 7184		
నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు-2,22,179		
పురుషులు	-	1,06,921
మహిళలు	-	1,15,239
ట్రాన్స్‌జెండర్లు	-	19
మండలాల వారీగా..		
పొన్నూరు పట్టణం మొత్తం	-	49,871
పురుషులు	-	23,692
మహిళలు	-	26,172
ట్రాన్స్‌జెండర్లు	-	7
పొన్నూరు మండలం మొత్తం-		50,627
పురుషులు	-	24,563
మహిళలు	-	26,062
ట్రాన్స్‌జెండర్లు	-	2
చేబ్రోలు మొత్తం ఓటర్లు	-	58,646
పురుషులు	-	28,527
మహిళలు	-	30,113
ట్రాన్స్‌జెండర్లు	-	6
పెదకాకాని మొత్తం ఓటర్లు	-	63,035
పురుషులు	-	30,119
మహిళలు	-	32,892
ట్రాన్స్‌జెండర్లు	-	4

సర్వే పూర్తి చేశాం



ఓటర్ల జాబితాలపై ఇంటింటి సర్వే పూర్తి చేశాం. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి మంగళవారం సమావేశం నిర్వహించి సర్వేలకు సంబంధించి పూర్తి వివరాలు అందజేశాం, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అంతా సక్రమంగా ఉన్నదీ లేనిదీ సరి చూసుకోవాలని సూచించాం.

–వై.హరిహరనాథ్, ఓటరు నమోదు అధికారి

నందగోపాలా.. నవనీత చోరా..

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థినులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణాష్టమి పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సందడిగా ఉట్టి కొట్టారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల్ని చాటి చెప్పడం మన బాధ్యతని తెలిపారు. భావితరాలకు మనం ఇచ్చే వారసత్వ సంపద అవే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

==బ్రాడీపేటలోని శ్రీమేధ విద్యాసంస్థల క్యాంపస్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా జరిపారు. సంస్థ డైరెక్టర్ అన్నా నందకిశోర్ మాట్లాడుతూ చేయిచేయి కలిపి సమష్టిగా కృషి చేస్తే ఎంతటి కష్టమైన కార్యమైనా సాధించవచ్చునని అనేందుకు కృష్ణాష్టమి పండుగలో ఉట్టికొట్టడం ప్రతీకని వివరించారు. చిన్నతనంలో అల్లరి పనులు చేసిన శ్రీకృష్ణ పరమాత్ముడు పెద్దయిన తరువాత గీతోపదేశం గావించి జగద్గురువు అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

==ఎల్‌ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం వారితో ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీమేధ క్యాంపస్ ప్రాంగణంలో ఉట్టి కొడుతున్న నందకిశోర్, పక్కన శ్రీలక్ష్మి



విజ్ఞాన్ స్కూలులో ఉట్టి కొడుతున్న విద్యార్థి

వేడుకల్లో పాల్గొన్న అంబటి రాయుడు

పట్నంబజారు : కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా నగరంలో జరిగిన వేడుకల్లో ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు. నగరంలోని తూర్పు నియోజకవర్గం, యాదవ బజారులోని గీతా మందిరంలో బుధవారం తలారి రాము, రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి రాచమంటి భాస్కర్, స్థానికులు పాల్గొన్నారు.

గుడివాడలో యాదవ కమ్యూనిటీ హాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్



ఎంపీపీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: రూరల్ మండలం గుడివాడ గ్రామంలో సీఎం డీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాలును బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తల్లి సాంబ్రాజ్యంలు ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణ మందిరంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉట్టిని ఎమ్మెల్యే కొట్టారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాసరావు, మేస్త్రీ బాజి, పద్మావతిలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో దేశబోయిన గోపిరాజు, దానబోయిన వేణు, బి.రమేష్, శివరామబ్రహ్మం, వెంకయ్య, బోడయ్య, మోషె తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో కార్పొరేషన్ అధికారులు సిమెంటు రోడ్డును పగులగొట్టారు. ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మతులు, కొత్త డ్రెయిన్ నిర్మించేందుకు బుధవారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రధాన రోడ్డులో గతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రూ.10 లక్షలు కేటాయించి నూతనంగా 600 మీటర్లు పొడవున డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే తాడేపల్లి ఒకటో వార్డు నుంచి కృష్ణుడి గుడివరకు సుమారు వెయ్యి మీటర్ల పొడవున పైపులైన్ల నిమిత్తం పగులగొట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని పునర్నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ. 10లక్షల నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఆటస్థలంలో గ్రావెల్‌తో మెరక

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో బుధవారం గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి కన్నా పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు మీద ఉన్న మురుగునీటితో పాటు వర్షపునీరు చేరి ఆటస్థలం చెరువులాగా మారుతుంది. వర్షం పడిన తరువాత రెండు మూడు రోజులు ఆట స్థలంలో అసెంబ్లీ నిర్వహించడానికి గానీ, విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే ఆర్కే ఈమనిలో పర్యటించిన సందర్భంగా ఈమని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ వారు ఆటస్థలంలో తరచూ నిలుస్తున్న వర్షం నీరు, మురుగునీరు గురించి చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో ఈమని పాఠశాలలో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో గ్రావెల్ ఫిల్లింగ్ పూర్తికానుందని పేరెంట్స్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తెలిపారు. పాఠశాల ఆటస్థలంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంపై ఎమ్మెల్యే ఆర్కేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం అమ్ముతున్న యువకుడి అరెస్ట్



ఫిరంగిపురం: అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకుడిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడివద్ద జి.ప్రశాంత్ కుమార్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్‌ఐ చల్లా కిషోర్ తన సిబ్బందితో వెళ్లి ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని అతడివద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నరసరావుపేట కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కోర్టు యువకుడికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.

జొన్నలగడ్డలో క్రికెటర్ అంబటి రాయుడు సందడి

- స్థానిక ప్రజలతో మాటామంతి
- రైతులతో ముఖాముఖి



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ చెరువు వద్ద మొక్కలు నాటారు. గ్రామంలోని విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా తదితర విషయాలు తెలుసుకున్నారు. గ్రామంలోని రైతులతో ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలకు రైతులతో చర్చించి ఏవిధంగా పరిష్కారం చూపాలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. గ్రామ పెద్దలతో చర్చించారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్ళి వారితో మాట్లాడారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, గ్రామ పార్టీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, వంగా నవీన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, మబ్బు సుధాకర్, గ్రామ పెద్దలు ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగా భగీరథ కమ్యూనిటీ హాలు ప్రారంభం

- నగర సామాజిక వర్గ ప్రజలు కమ్యూనిటీ హాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే ఆర్కే
- కార్యక్రమంలో పాల్గొన్న జేసీ, ఎమ్మెల్సీ మురుగుడు



సగర భగీరథ కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న జేసీ జి.రాజకుమారి

మంగళగిరి: సగర సామాజిక వర్గ ప్రజలు కమ్యూనిటీ హాలును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో మురికికూపంగా ఉన్న ఈ ప్రాంతంలో సుమారు రూ.75 లక్షల కార్పొరేషన్ నిధులతో కార్పొరేట్ తరహా కమ్యూనిటీ హాల్ నిర్మించుకుని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్థానికుల నుంచి వచ్చిన వినతి మేరకు గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఈ ప్రాంతంలో అధికంగా నివసించే సగర సామాజికవర్గ సోదరులకు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించేలా సమాజంలో అందరిలో సమానత్వం ఉండేలా చిన్న చిన్న కులాలకు సైతం గుర్తింపు, గౌరవాన్ని కల్పిస్తూ ఇటువంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఆయా ప్రాంతాల్లో ఉండే సామాజిక వర్గ ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారి వివాహ శుభకార్యాలతో పాటు ఇతర అవసరాలకు సంబంధించి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యు.శారదాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షుడు పందేటి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి జూట్రు ఏడుకొండలు, సంఘం నాయకులు గండికోట అచ్చయ్య, కలవకొల్లు గోపి, నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, కఠారి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ శంఖారావం



చైతన్య మహోత్సవంలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

పాత గుంటూరు: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్, కల్యాణ ట్రస్ట్, వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో హిందూ ధర్మ సంప్రదాయ చైతన్య మహోత్సవ శివ శంఖారావం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీ శివస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం 108 మంది దంపతులతో సర్వ సూక్త హోమం, చిన్నారులకు శ్రీ కృష్ణుని వేషధారణ, పూర్ణాహుతి, మంత్ర పుష్పం, పంచ మాంగల్యాలు, సంప్రదాయ వస్త్ర అలంకరణ ప్రదర్శన, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ శ్రీ కృష్ణుల కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, తులసి గ్రూపు సంస్థల చైర్మన్ తులసి రామచంద్రప్రభు, బి.కృష్ణంరాజు, వేముల హజరత్తయ్య గుప్తా, దేవరశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఇండియా వలస పాలకులు పెట్టిన పేరు

వలస పాలకులు దేశానికి ఇండియా అని పేరుపెట్టారు గానీ తరతరాలుగా మన దేశం భారతదేశమేనని బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ తెలిపారు. శివ శంఖారావం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేసులో ఐటీ, ఈడీ సంస్థలు వాటి పని అవి చేస్తాయని చెప్పారు. భారత్ జోడో యాత్ర చేసిన రాహుల్ గాంధీ నేడు భారత్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన కంఠరాజు కొండూరుకు చెందిన అల్లూరి ఏసుబాబు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు నలుగురు యువకులు గూడ్సు ఆటోలో వాటర్ క్యాన్లు తరలిస్తున్నారు. ఈ సమయంలో ఆటోడ్రైవర్ రామకృష్ణతో పాటు డి.వెంకటేశ్వర్లు, అల్లూరి ఏసుబాబుతో పాటు మరో యువకుడు ప్రయాణిస్తున్నారు. కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న మలుపులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు (20) అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ రామకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి. మృతి చెందిన ఏసుబాబుకు తండ్రి చనిపోవడంతో కుటుంబ భారాన్ని ఇతనే తీసుకుని తన తల్లిని పోషించుకుంటున్నాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది. రోడ్డు ప్రమాద సమాచారాన్ని అందుకున్న దుగ్గిరాల పోలీసులు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఏసుబాబు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.